# విద్య

మురో ఛార్లెస్




మొదటి కానుపు ఆడపిల్ల అయినందుకు వ్యవహారికంగా ఆ కుటుంబ సభ్యులు ఎవరూ విచారించ లేదు. అలాగని లక్ష్మీదేవి పుట్టిందని మహదానందమూ పడలేదు. కుటుంబంలోకి ఒక క్రొత్త సభ్యురాలు వచ్చిందని సంతోషించారు. ఘనంగా బారసాల చేసారు. వనజా-గిరీశం దంపతులకు పుట్టిన ఆ పాపకు విద్య అని పేరుపెట్టారు.

విద్యను సార్థక నామధేయురాలిగా చేయాలనుకున్నారు.

అలాగని మూడవ ఏట నుండీ ఎల్.కే.జిలో పడేయాలనుకోలేదు.

ఇంటి వద్దే ముందు మాతృభాషలో అక్షరాల పరిచయం అవీ కానిచ్చి పాత పద్ధతి ప్రకారమే ఐదవ ఏటనే పాఠశాలలో చేర్చాలనుకున్నారు. కాన్వెంట్‌లో చదివించే స్తోమతు ఉన్నా మొదట ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చాలని - ఆ తరువాత తన ఈడు పిల్లల్ని చూసి వారి దుస్తులు తదితరాలకు ఆకర్షింపబడి కాన్వెంట్‌లో చదివించాలి అనుకుంటే చేర్చవచ్చని అనుకున్నారు. గ్రేడ్‌లో రాంక్‌లకు అతీతంగా చదివించాలనుకున్నారు. విద్య విజ్ఞానం కోసమే కాని బ్రతుకు తెరువుకు ప్రాతిపదిక కారాదని వారి నమ్మకం మరి.

విద్య పుట్టిన సంవత్సరానికి మగపిల్లవాడు కలిగాడు. వాడికి వివేక్ అని పేరు పెట్టారు... విద్య నిజంగానే పేరుని సార్థకం చేసుకునేది. వివేక్ ఆంగ్లంపట్ల ఆసక్తి కనపరచ సాగాడు. విద్య ప్రభుత్వ పాఠశాలలోనూ - వివేక్ కాన్వెంట్‌లోనూ చదవసాగారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్య అంటే వివేక్‌కి మొదటి నుండీ చిన్న చూపే.

విద్య తెలుగు భాషలో మంచి పట్టు సంపాదిం చింది.

ఆంగ్ల భాషతో పరిచయం పెంచుకున్నది.

సునిశిత దృక్పథంతో సమాజాన్ని పరిశీలించ సాగింది. అలాంటి సమయంలోనే వారి జీవితంలో ఒక కుదుపు సంభవించింది. విద్య తల్లి వనజ అనారోగ్యంతో మరణించింది. గిరీశం కూతురికి వివాహం చేయాలని తొందరపడ్డాడు. విద్య తనకు అప్పుడే వివాహం వద్దు అన్నది. వివేక్‌కు పెళ్ళి జరిగింది. ఫివేక్ భార్య అరుణ కొంచెం అతిశయం కలది. ఆపైన విద్య తెలివితేటలకు అసూయ. ఏదో విధంగా సాధించాలని ప్రయత్నించేది. వివేక్ బ్యాంకు ఉద్యోగి అరుణ సొసైటీ లేడి.

ఈ పరిస్థితుల్లో గిరీశంలో కూడా మార్పు వచ్చింది. అంతవరకు విద్య సహజమైన మనస్తత్వంతో ఎదుగుతూ వచ్చింది. ఎలాంటి

అత్యంతో రాలు లేవు. అలాంటి దశలో గిరీశంలో వచ్చిన మార్పు ప్రభావం విద్య మీద పడేసరికి ఆమె తల్ల డిల్లిపోయింది. ఖాళీగా కూర్చొని సాహితీ పఠనం - వీధిలోని పిల్లలకు ఉచిత విద్యా బోధనా చేసే బదులు కంప్యూటర్ నేర్చుకోమని బలవంత పెట్టే వాడు. అతడి మాటల్లో వ్యాపారధోరణి పొడ చూపసాగింది. ప్రపంచీకరణ నేపథ్యంలో విని మయ సంస్కృతి ప్రభావం అతడిపై పడింది మరి.

"నలుగురూ కష్టపడితేనే గాని జరగని రోజులు ఇవి ఎవరికి వారు తెలుసుకోవాలి. ఊరిని ఉద్ధరిస్తాను అని బయలుదేరే బదులు. ఇంటిని ఉద్ధరించుకోవాలి. వేడి నీళ్ళకు చల్లనీళ్ళు తోడని ఆ చెప్పే చదువేదో నాలుగు డబ్బులు తీసుకుని చెప్పినా బాగుండేది." అరుణ బాహాటంగా విసుక్కోసాగింది.

ఆర్థిక స్వేచ్ఛ మనిషికి అవసరం అని తొలి సారిగా తెలిసి వచ్చింది విద్యకు. విద్యకు స్నేహితులు ఎక్కువే. ఓ స్నేహితురాలి సహాయంతో... ఓ ప్రైవేట్ పాఠశాలలో అధ్యాపకురాలిగా చేరింది. కాని ఆమెకు అర్థం కాని విషయం ఒకటే.... నలుగురూ కష్టపడితేనేగాని జరగని రోజులు అని ప్రవచించిన అరుణ డిగ్రీ హోల్డర్ అయి ఉండి కూడా ఉద్యోగానికి ప్రయత్నించకపోవడం. తను ఉచితంగా విద్యా బోధన చేస్తుంటే కనీసం తృప్తి అయినా మిగులుతోంది. మరి అలా మహిళా మండలుల వెంట తిరుగుతుంటే ఒరిగేదేమిటో? అసలా మహిళా మండలి సభ్యురాళ్ళకు సగటు మహిళల సమస్యల గురించి అవగాహన ఉందా అనేది అనుమానమే. చందాలు సేకరించడం. పోష్ పార్టీలు, కిట్టీ పార్టీలు ఇవే వాళ్ళ కార్యక్రమాలు. తనకు అవసరం కాని విషయాలను గురించి ఆలోచించడం అనవసరం అనుకున్నది విద్య.

"చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత మహదేవ అని... అదే కాన్వెంట్‌లో చదివి ఉంటే ఎంత బాగుండేది... గొర్రె తోక బెత్తెడు జీతం - గుర్తింపు లేని పంతులమ్మ ఉద్యోగం." వివేక్ ఈసడింపు.

విద్య మొసగును వినయము అనేది విద్య పట్ల అక్షరాల నిజము వివేక అసార్థకనామధే యుడు.

విద్య వ్యాపార స్థాయికి చేరుకున్న దశ.

విలువలు మృగ్యమై వెలలు మాత్రం తళుకులీనే వ్యవస్థ.

ఇది సంధియుగం. అందుకే ఈ సామాజిక రుగ్మతలన్నీ విరుచుకు పడ్తున్నాయి. ప్రతి నిర్మూలన వెనక ఒక నిర్మాణం ఉంటుంది. మానవాళికి ముందుంది మహర్దశ. ప్రస్తుతం నిర్మూలనా కాలం జరుగుతోంది. చలం చెప్పినట్లు పాత విలువల పడిపోయాయి. కొత్త విలువలు ఇంకా ఏర్పడలేదు. ఆ కొత్త విలువల కోసం నవతరం - యువతరం కృషిచేయాలి. కాని ఆతరమే చేవచచ్చి ఉంటే ఆ జాతి భవిత?

ఆలోచిస్తున్న కొలది విద్యకు ఒళ్ళు జలదరిస్తోంది.

అలాంటి పరిస్థితుల్లో గిరీశం కూడా మరణించాడు.

విద్య పాఠశాలలో మంచి పరపతి సంపాదించు కున్నది. ఉచితంగా చదువు చెప్పడం మాని రెండు మూడు కార్పోరేట్ స్థాయి వారి ఇళ్ళల్లో పెద్ద మొత్తాలకు ట్యూషన్లు చెపుతోంది. ఇంటికి డబ్బు బాగానే ఖర్చు పెడుతోంది.

అయితే వివేక్‌లో విపరీత భావాలు చోటుచేసుకున్నాయి.

నైతిక విలువలకు తిలోదకాలిచ్చాడు.

ఒక విధంగా అతడలా మారడానికి అరుణే కారణం. విద్య చూసీ చూడనట్లు ఊరుకునేది.

ఇంకొంత బ్యాంక్ బ్యాలెన్స్ పెరిగితే లేడీస్ హాస్టల్‌కు షిఫ్ట్ అయ్యే ఆలోచనలో ఉన్నది.

ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మ విశ్వాసం వెరసి విద్యకు నూతన తేజాన్ని కలిగించాయి. ఆ తేజం చూసి అరుణ తెల్లపోయింది. భయపడేది.

ఇలా కాదనుకుంది అరుణ. వివేక్‌తో చర్చించింది.

ఓ పాతిక సంవత్సరాల క్రితం అంత ధైర్యంగా ఏ భార్య అయినా తన భర్తతో ఆడపడుచు గురించి అలా చర్చించే దుర్మార్గ మనస్తత్వంతో ఉండేది కాదు. సాధించి ఇంటి నుండి సాగనంపాలనుకునే దేమొగాని అలా సొమ్ము చేసుకోవాలనుకుని ఉండేది కాదు. అధనా అన్నా ఆమె చెంప పేలిపోయి ఉండేది.

మరి ఇది నవనాగరిక యుగం కదా!

అరుణ-వివేక్‌లు నవనాగరికులు కదా!

అందుకే అరుణ చెప్పినది విన్న వివేక్ మొఖం విప్పారింది.

నీతి-జాతి-సిగ్గూ-ఎగ్గూ వదిలేసిన మనుషులు, అయితే అరుణ సలహాను విద్య ముందు ఉంచడానికి తటపటాయించాడు. అరుణే చొరవ చేసింది.

"చూడమ్మా! విద్యా.....! వయసు కోరికలు నాకు తెలుసు. కోరికలు తీరడానికి పెళ్ళే కానక్కర లేదు. ఆ రోజులు పోయాయి. ఇటు కోరికలూ తీర్చు కోవచ్చును. అటుడబ్బు సంపాదించ వచ్చును. ఆపని నేను చేయవచ్చు.... కాని నీ వయసు సొగసు నాకు లేవు కదా. అయినా నేనేం మడి కట్టుకు లేను. మీ తమ్ముడి ప్రమోషన్లకు ఆ పనే చేస్తూ వచ్చాను. అంతా సంసార పక్షంగా జరుగుతోంది. ఇంతకన్నా పెద్ద అపార్ట్‌మెంట్‌లోకి మారుదాం. బాగా డబ్బున్న కష్టమర్స్ చాలామంది మీ తమ్ముడికి తెలుసు. మనం అలా ఎదిగి.... ఏ స్టేట్స్‌కో పోయి సుఖంగా ఉండవచ్చును ఏమంటావు?"

నిశ్చేష్టురాలై వింటూ ఉండిపోయింది విద్య.

నిజమా? కలా?

గతంలో వేశ్యల్ని లోఫర్లు, డాఫర్లు తయారు చేసేవారు. నేడు కుటుంబ సభ్యులే ప్రోత్సహిస్తున్నారు. విధి లేక పొట్ట కూటి కోసం, వ్యభిచరించడం వేరు. జీవితం మరింత సుఖవంతం కావాలనే ఆత్యాశతో వ్యభిచరించడం వేరు.

విద్య వేదాంతిలా నవ్వింది.

ఆ నవ్వులో మొనాలిసా నవ్వుంది.

"అమ్మా.... నీ విద్య నువ్వు బ్రతికున్నన్నాళ్ళు విద్య - విద్యగానే ఉన్నది. నీ మరణంతో నాన్న నన్ను వ్యాపారస్థాయికి దిగజార్చాడు. తమ్ముడు, మరదలూ ఇప్పుడు ఆ స్థాయి నుంచి వ్యభిచార స్థాయికి దించ యత్నిస్తున్నారు. నేను నీ రక్తం పంచుకు పుట్టానమ్మా పతనం కానూ...." మనో నేత్రాలతో తల్లిని దర్శించి అనుకున్నది విద్య.

సూటిగా చూస్తున్న విద్య చూపులకు తట్టుకోలేక పోతున్నది అరుణ.

"....అపార్థం చేసుకోకు. నలుగురితో పాటే మనం...."

"మనం అనకు నేను కలవను, నా దగ్గర విద్యా ధనం ఉంది. దానిని కరిగించుకుని బ్రతక కలను. నువ్వు సంపాదించమంటున్న ధనానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇనప్పెట్టెల్లో దాచాలి. దొంగలు దోచుకుంటారేమోనని భయపడుతూ బ్రతకాలి. ఖర్చు పెడితే తరుగుతుందమో అనుకోవాలి నా విద్యా ధనం అలా గాదు. అది నన్ను వెన్నంటే ఉంటుంది. దాని నెవరూ దోచుకోలేరు. ఖర్చు చేస్తున్నా తరుగుతున్నదన్న భయం లేకపోగా ఇంకా పెరుగుతుందన్న భావం ఆనందాన్ని ఇస్తుంది. అయినా ఒకమాట - నీతి తప్పాలి అనుకుంటే - నేను నీతి తప్పి సంపాదించిన దానిని మీ ఉమ్మడి ఖాతాలో పెట్టాలి అనుకుంటే.... నేనెందుకు సిద్ధం కావాలి. నా కోసమే నేను నీతి తప్పుతాను. నా కోసమే నేను సంపాదించుకుంటాను. నా దగ్గర ఉన్న విద్యాధనం నేను జీవించడానికి పనికిరాదు అనుకున్నప్పుడు ఆ పని చేస్తాను. నేను రేపే ఈ ఇంట్లో నుండి వెళ్ళిపోతున్నాను. నాకు నీ మీద కోపం రావడం లేదు. జాలి వేస్తుంది.... రేపు నీ కడుపున ఒక కూతురు పుడితే.... నీ కోరికను సిద్ధింపచేసుకోవడానికి ప్రయత్నించు."

నిర్వికారంగా చూస్తు ఉండిపోయింది అరుణ.

"బంగారు నావ - బ్రతుకు బంగారు నావ

దాన్ని నడిపించు నలుగురికి మేలైన త్రోవ"

సుశీల స్వరం విద్య గదిలో నుండి టేప్ రికార్డర్ ద్వారా వినిపించసాగింది.

అంతకు క్రితమే స్నానం చేసిన విద్య మళ్ళీ తలారా స్నానం చేయాలనుకున్నది.